మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు

కార్మిక వ్యతిరేక విధానాలు వీడకపోతే ఉధృత పోరాటాలు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
ముగిసిన సిఐటియు అనంతపురం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఉధృత పోరాటాలు చేయనున్నట్లు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. రెండు రోజుల పాటు అనంతపురం నగరంలో నిర్వహించిన సిఐటియు 11వ అనంతపురం జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన రెండోవ రోజు మహాసభలకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఆఫీస్ బేరర్స్ హాజరయ్యారు. మహాసభలకు మద్దతుగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి హాజరయ్యారు. ఎంతో చైతన్యవంతంగా ఉత్సాహంగా సాగిన మహాసభల్లో ఆయా రంగాల కార్మికుల సమస్యలను ప్రాంతాల వారీగా ప్రతినిధులు మహాసభలో ప్రవేశపెట్టి చర్చించారు. కార్మికుల సమస్యలు, హక్కులు, వేధింపులు, తొలగింపులు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కార్మిక రంగాల వారీగా తీర్మానాలు ప్రవేశపెట్టగా 15 తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 13 గంటలు పని విధానానికి అసెంబ్లీలో తీర్మానాంచడం, మహిళలు రాత్రిపూట డ్యూటీ చేయమనడాన్ని వ్యతిరేకించారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇస్తూ రెగ్యులర్ చేయాలని తీర్మానించారు. అనంతపురం జిల్లాకు కల్పవృక్షంగా ఉన్న ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేసి కొనసాగించాలని వీటి కోసం కార్మికులందరూ పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపి, రెగ్యులర్ చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయం ఉపసంహరించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని మహిళలపై దాడులు అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆటో కార్మికులపై వేధింపులు పెనాల్టీలు, ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పని చేస్తున్న డ్రైవర్లపై విధించిన పెనాల్టీలు కేంద్ర ప్రభుత్వం చేసిన 21 జిఓను రద్దు చేయాలని తీర్మానించారు. ఈ తీర్మానాలను ఆమోదించి భవిష్యత్ పోరాటాలు చేయనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అనంతరం 59 మందితో సిఐటియు జిల్లా నూతన కమిటీని, వారిలో 19 మందిని ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆర్‌వి.నాయుడు, గోపాల్, వెంకటనారాయణ, రామాంజినేయులు, ముర్తుజా, శ్రీనివాసులు, రమాదేవి, శకుంతల, శివ ప్రసాద్, నాగభూషణం, సాకే నాగరాజు, నాగార్జున రెడ్డి, ఏటిఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రయివేటీకరణ విధానాలు వీడాలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ ప్రయివేటీకరన విధానాలు వీడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. ప్రయివేటీకరణ వల్ల ఇటు ప్రజలకు, కార్మికులకు ప్రభుత్వానికి నష్టం జరుగుతోందని, యాజమాన్యాలు లాభపడతున్నాయని తెలిపారు. విద్యుత్ రంగంలో అతి ప్రమాదకర పనులు చేస్తూ కార్మికులు మృతి చెందుతున్నారని, వారి కుటుంబాలకు ఎలాంటి భద్రత ఆదరణ లేకుండా పోతోందన్నారు. సిమెంట్ పరిశ్రమల్లో కార్మికులంతా కాంట్రాక్ట్ కార్మికులుగా అతి తక్కువ వేతనాలతో పని చేయించడం అన్యాయంగా ఉందన్నారు. ప్రభుత్వం శ్రమ ద్వారా సంపద సృష్టించే కార్మికులను అనగదొక్కాలని చూస్తే కార్మిక వర్గం తిరగబడుతుందని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమతున్నామన్నారు. డిసెబర్ 31, జనవరి 1,2,3,4 తేదిల్లో విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న సిఐటియు అఖిలభారత మహాసభల్లో భవిష్యత్ పోరాట కార్యచరణ రూపొందిస్తామన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని 13 గంటలుగా పెంపుదల చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు పి4 విధానం అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి చెబుతుండటం మోసపూరితంగా ఉందన్నారు. ఈ దుర్మార్గపు విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తుందన్నారు.

'మనీ' ప్లానింగ్..!

- యథేచ్ఛగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు
- బఫర్ జోన్లనూ వదలని అక్రమార్కులు
- ఎల్‌టిపిల మధ్యవర్తిత్వంతో సొంత జేబులోకి మున్సిపల్ ఆదాయం
- పట్టణాభివృద్ధికి జిల్లా అధికారులు చొరవ చూపాలని ప్రజా సంఘాల డిమాండ్
- నేటి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చేనా..?

కదిరి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా కృషి చేయాల్సిన మున్సిపల్ అధికారులు మనీ ప్లానింగ్ విభాగంగా మార్చేసారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. సహజంగా మున్సిపాలిటీ అభివృద్ధికి టౌన్ ప్లానింగ్ విభాగం కీలకం. టౌన్ ప్లానింగ్ విభాగంలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసే సమయంలో మున్సిపల్ అధికారులు అనధికారికంగా డబ్బులు (ముడుపులు) తీసుకొని మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న అక్రమార్కులకు సాయపడుతూ పట్టణాభివృద్ధి కుంటు పడేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపాల్టీల ఆదాయం పెంచేలా భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడానికి, మున్సిపాలిటీలో అవినీతిని తగ్గించడానికి అనధికార లేవుట్లను అక్రమ నిర్మాణాలను నియంత్రించడానికి ప్రభుత్వం ఆన్లైన్ పద్ధతిలో అనుమతుల ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే కొందరు స్వార్థపరులు చిన్న నీటి కాలువలు , రైల్వే ట్రాక్ లాంటి బఫర్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. కదిరి పరిధిలో అనంతపురం రోడ్డు భారత్ పెట్రోల్ బంకు సమీపాన రైల్వే ట్రాక్ పక్కన జిప్లస్ 4 బహుళ అంతస్తుల భవనం నిర్మాణం , బఫర్ జోన్లలో సైతం నిర్మాణాలు, అనంతపురం రోడ్డు పూర్వపు భారత్ ఐటిఐ వెనుక చెరువుకి సమీపంలో ఊట నీరు నిల్వ ప్రాంతంలో సైతం ఎలాంటి నిబంధనలు పాటించకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదు. పైపెచ్చు వారు అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టణ అభివృద్ధిలో అనైతిక పద్ధతులు వలన మున్సిపల్ ఆదాయానికి నష్టం కలగడం కాకుండా భవిష్యత్తులో భారీ నష్టాలు జరిగే ప్రమాదం ఉంది. భారీ వర్షాలు వస్తే భూమి సామర్థ్యం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణాలు కూలిపోయే ప్రమాదం ఉందనినిపుణులు చెబుతున్నారు. అలాగే బఫర్ జోన్లలో నిర్మాణాలు వలన సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో భారీ వర్షాలు కురిసే సమయంలో వర్షపు నీటి ధాటికి పట్టణంలోని చిన్న నీటి కాలువలు సామర్థ్యం తట్టుకోలేక వరద ముంచెత్తి ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. అంతేకాక అక్రమ నిర్మాణాలు పట్టణ అందాన్ని, భద్రతను దెబ్బతీస్తాయనితద్వారా ప్రజల ఆస్తికి నష్టం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు : పట్టణంలోని కొత్త బైపాస్ రోడ్డు లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిసినా మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. రైతుల నుండి రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిని కొనుగోలు చేసిన తర్వాత ఆ భూమిలో లే అవుట్ వేసే ముందు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చడానికి ప్రస్తుత భూమి మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వానికి నగదు చెల్లించాలి. అలాగే లేవుట్ వేసే సమయంలో వినియోగదారుల భవిష్యత్ అవసరాల కోసం రోడ్లు, డ్రయినేజీలు, తాగునీటి వసతి తదితర వాటి కోసం కొంత భూమిని వదలాలి. అలాగే ముప్పై అడుగుల రోడ్డు చూపించాలి. భూమిని బట్టి అప్రాంతంలో భవిష్యత్ అవసరాల కోసం మున్సిపాలిటీకి ఖాళీ స్థలం కేటాయించాలి. అయితే వీటన్నిటిని తుంగలో తొక్కి అక్రమ లేఅవుట్లు వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులను నిలువరించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కదిరి పట్టణం నడిబొడ్డున వికలాంగుల భవనం ముందర ఓ బిల్డింగ్ యజమాని అక్రమంగా రోడ్డును సైతం ఆక్రమించి రోడ్డు పై పిల్లర్ వేసేశాడు. రోడ్డును సైతం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న మున్సిపల్ అధికారులకు ఇది కనిపించడం లేదా అని పట్టణ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల సమయంలోనే మున్సిపల్ అధికారులు అడ్డుకోకుండా ఆ తరువాత తీరిగ్గా నోటీసులతో మమ అనిపిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి.

అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి సంబంధిత (మున్సిపాలిటీ) లేదా పట్టణ ప్రణాళికా సంస్థ నుండి అనుమతి తప్పనిసరి పొందాలి. అలాగే, బిల్డర్లు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ)లో తమ ప్రాజెక్టులను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందు రెరా నుండి అనుమతి పొందాలి. నిర్మాణ సమయంలో భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక వ్యవస్థ, అత్యవసర మార్గం, వెంటిలేషన్, మౌలిక సదుపాయాలు, పార్కింగ్ స్థలం, సివిల్ ఇంజనీర్ నుండి నిర్మాణ నివేదికలు, డ్రాయింగ్‌లు, అండర్‌టేకింగ్ సర్టిఫికెట్లు ఉండాలి. అనుమతి లేకుండా డిపాజిట్లు సేకరించడం చట్టవిరుద్ధం. చట్టపరమైన ఇబ్బందులను నివారించడానికి భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు తాజాగా ఉండాలి. కొనుగోలు దారులు బిల్డర్ల చరిత్రను, వారి పూర్వ ప్రాజెక్టులను పరిశీలించి చూసుకోవాల్సి ఉంటుంది. నిర్మాణ డ్రాయింగ్‌లు, నిర్మాణ నివేదికలు, సివిల్ ఇంజనీర్ ద్వారా అండర్‌టేకింగ్ సర్టిఫికెట్, నిర్మాణ డ్రాయింగ్‌లు వంటివి కలిగి ఉండాలి. ప్రభుత్వ అనుమతులు లేకుండా రెరాలో నమోదు కాని ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లను కొనుగోలు చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. అపార్ట్మెంట్ నిర్వాహకులు ప్రీ లాంచ్‌లో డిపాజిట్లు సేకరించడం చట్టవిరుద్ధం.కొనుగోలుదారులు అపార్ట్మెంట్‌లు కొనుగోలు సమయంలో జాగ్రత్తగా అన్ని సరిచూసుకుని కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

మున్సిపల్ కౌన్సిలర్లు చొరవ చూపేరా..?

మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు



కదిరి పట్టణంలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. మామూళ్ల మత్తులో మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. తద్వారా పట్టణ అభివృద్ధి కుంటుపడింది.

జి ఎల్ నరసింహులు,
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కదిరి

అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాం



కదిరి పట్టణంలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాలపై దృష్టి సారించాం. అనంతపురం రోడ్డు నందు నిర్మాణం జరుగుతున్న భవనానికి సెల్లార్‌కి, మూడంతస్తులకి అనుమతులు పొందారు. మరో అంతస్తు నిర్మించారు వాటికి సంబంధించి నోటీసులు జారీ చేస్తాం. అక్రమ లేఅవుట్లకు సంబంధించి లేఅవుట్ రెగ్యులరైజేషన్ సిస్టంకి ప్రభుత్వం వచ్చేనెల 25 వరకు గడువు విధించింది. వచ్చే నెల 25 తర్వాత అనుమతులు పొందని లేఔట్ లను తొలగిస్తాం.

కిరణ్ కుమార్,
మున్సిపల్ కమిషనర్ కదిరి.

రోడ్డులో నిర్మించిన పిల్లర్

పిల్లర్ నిర్మాణం వద్ద ఊటనీరు

అంగన్వాడీలకు లబ్ధిదారులు సహకరించాలి

ఐసిడిఎస్ పీడీ ప్రమీల

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

అంగన్వాడీ కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం కేటాయించిన పథకాల్లో భాగంగా అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని తక్షణమే పొంది అంగన్వాడి కార్యకర్తలకు సహకరించాలని శ్రీ సత్య సాయి జిల్లా పిడి ప్రమీల పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాలు ఎన్ని ఉన్నాయి వాటి నిర్వహణ ఎలా ఉంది ?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు 2824 ఉన్నాయి. వాటి నిర్వహణ పనితీరులో ఎలాంటి లోపాలు లేవు. ఇటీవల ప్రభుత్వం 618మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడానికి ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో ప్రస్తుతం 584 మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చడానికి వీలు ఉంది. దాని ప్రకారం వాటి మార్పు నిర్వహణ సంబంధిత సూపర్వైజర్లకు అప్పగించాం. ఆరు సంవత్సరాల లోపు పిల్లలు ప్రీస్కూల్ నందు శిక్షణ పొందుతున్నారని అదేవిధంగా గర్భవతులు బాలింతలు కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందుతున్నారు.

ప్ర : అంగన్వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు ఏయే పౌష్టికాహారం అందజేస్తున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా గర్భవతులకు బాలింతలకు ఒక్కొక్కరికి నెల కు 25 కోడిగుడ్లు ఐదు లీటర్ల పాలు బాల సంజీవని కిట్లు అందజేస్తున్నాం. రు నెలల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం అందించడంతోపాటు 25 గుడ్లు ,రెండున్నర లీటర్ పాలు, టి హెచ్ ఆర్(టేక్ హెూమ్ రేషన్) క్రింద ఇవ్వనున్నాం. ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీస్కూల్ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం తోపాటు నూరు మిల్లీ లీటర్లు పాలు ఒక గుడ్డు అందిస్తాం.

ప్ర : జిల్లాలో బాల్యవివాహాలు అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: బాల్యవివాహాలను అరికట్టడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కర్నాటక సరిహద్దు ప్రాంతాలైన మడకశిర ,అమరాపురం, ఆగలి ,గుడిబండ ,రొల్ల రొద్దం నల్లమాడ, అమడగూరు ,కదిరి, రాయదుర్గం, కళ్యాణ దుర్గం తాడిపత్రి, సింగనమల తదితర మండలాల్లో, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అక్కడ పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడంతో ఎన్నో బాల్య వివాహలను అడ్డుకున్నాం. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడు 112 బాల్య వివాహాలను అడ్డుకున్నాం.

ప్ర : జిల్లాలో నాసిరకం గ్రుడ్లు అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారని ఆరోపణపై మీ సమాధానం?

జ: జిల్లా వ్యాప్తంగా నాసిరకం గుడ్లు పంపిణీ చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత అధికారులద్వారా తగు చర్యలు చేపట్టాము. నాసిరకం సరుకులను పంపిణీ చేసినప్పుడు ఆయా కేంద్రాల అంగన్వాడి కార్యకర్తలే తిరస్కరించాలని, సమాచారాన్ని వెంటనే సంబంధిత సూపర్వైజర్లకు, సిడిపిఓ లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించాం. అలా చేసిన కాంట్రాక్టర్ల తీరులో మార్పు రాకపోతే వారి కాంట్రాక్ట్ ను రద్దు చేయడానికి ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తాం.

5) ఐసిడిఎస్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉందా?

జ: ఐసిడిఎస్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా వందమంది సూపర్వైజర్లు ఉండాల్సిన చోటు 50 మంది మాత్రమే ఉన్నారు. ఒక్కొక్క సూపర్వైజర్ రెండు, మూడు సెక్టర్లలో పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో కేంద్రాల పర్యవేక్షణ ఆలస్యమవుతోంది. మడకశిర మండలంలో 300 కేంద్రాలను అందువలన సకాలంలో కేంద్రాలను పర్యవేక్షించడానికి వీలు కావడం లేదు.

పారిశ్రామిక వాడలో కనిపించని అభివృద్ధి

మౌలిక వసతులు లేక ఇబ్బందులు
నేడు పరిశ్రమల యజమానులతో సమావేశం
సమస్యలపై ఎపిఐఐసి అధికారులు స్పందించేరా..?

నీటికుంటలను తలపిస్తున్న మురుగు నీరు, రసాయన వ్యర్థాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురంలో ఉన్న అతి పెద్ద పారిశ్రామిక వాడకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ పారిశ్రామిక వాడను 1985వ సంవత్సరం అక్టోబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ వందలాది పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. అయితే పారిశ్రామిక వాడలో మాత్రం అభివృద్ధి జాడ కనిపించడం లేదు. పాత పరిశ్రమలతో పాటు గార్మెంట్స్ పరిశ్రమలు కూడా తాజాగా వచ్చాయి. అయితే గత ప్రభుత్వం వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. కనీసం రోడ్ల విషయంలో కూడా శ్రద్ధ చూపించడం లేదు. దీంతో కనీస మౌలిక సదుపాయాలు లేక కార్మికులతో పాటు పరిశ్రమ యజమానులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కర్నాటక రాష్ట్రానికి హిందూపురం అత్యంత దగ్గరగా ఉండటంతో పాటు కేవలం 70 కిలో మీటర్ల దూరంలో అంతర్జాతీయ విమానశ్రయం ఉంది. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఎక్కువ మంది వస్తుంటారు. దీంతో పాటు కర్నాటక రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడి ఎక్కువగా ఉండటంతో పారిశ్రామిక వేత్తలు ఇక్కడికి వస్తున్నారు. పారిశ్రామిక వేత్తలకు ఇక్కడ ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు అనుమతులు సైతం సులువుగా ఇస్తుండటంతో ఎక్కువ మంది వస్తుంటారు. అయితే పారిశ్రామిక వాడలో ఎటువంటి అభివృద్ధి లేకపోవటం వల్ల ఈ మధ్య కాలంలో చాలామంది పారిశ్రామిక వేత్తలు ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. గత వైసిపి ప్రభుత్వం పారిశ్రామిక వాడ అభివృద్ధికి కనీస చర్యలు చేపట్ట లేదు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటి రాలేదు. శ్రీ సత్యసాయి జిల్లాలో 8 పారిశ్రామికవాడలు ఉన్నాయి. 1979లోనే అనంతపురంలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పుడే ఇక్కడ పారిశ్రామికడను నెలకొల్పారు. అయితే 1985లో ఎన్టీఆర్ హయాంలో ప్రత్యేక పారిశ్రామిక వాడను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం పారిశ్రామిక వాడలో 151 చిన్న, మధ్య భారీ తరహా పరిశ్రమలు ఏర్పాటు కాగా అందులో 30 వరకు మూతపడ్డాయి. మౌలిక వసతులు సరిగ్గా లేకపోవడంతో యజమానులు అవస్థలు పడుతున్నారు. నీటి సమస్య, అంతర్గత రహదారులు దెబ్బతినటం, మురుగు కాలువలు లేకపోవటం, వీధి దీపాల నిర్వహణ గాలి కొదిలేయడం వంటివి ప్రధానంగా వేధిస్తున్నాయి. చాలాచోట్ల అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వారానికి ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో నిర్వాహకులు నీటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు పెరిగిన విద్యుత్తు చార్జీల భారాన్ని మోయలేకపోతున్నామని, అదనంగా నీటి కొనుగోలుకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉందని పరిశ్రమ నిర్వాహకులు వాపోతున్నారు.

పేరు మార్పుతో అభివృద్ధి చెందేనా....?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పారిశ్రామిక వాడకు ఎన్టీఆర్ పారిశ్రామిక వాడగా పేరును మార్చింది. గతంలో ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వం కనీసం పేరు మార్పుతో అయినా పారిశ్రామిక వాడ అభివృద్ధి చేస్తుందో లేదో చూడాల్సుంది.

పట్టించుకోని పంచాయతీ...కన్నెత్తి చూడని ఐలా అధికారులు

గతంలో పారిశ్రామిక వాడ పంచాయతీల పరిధిలో ఉన్న సమయంలో పరిశ్రమల నిర్వహకులు చెల్లించే పన్నులతో పారిశ్రామిక వాడల్లో కాస్తొ కూస్తో రోడ్లతో పాటు ఇతర మౌళిక సదుపాయాలను పంచాయతీ అధికారులు కల్పించే వారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల మేరకు పారిశ్రామిక వాడ ఐలా పరిధిలోకి ప్రస్తుతం పరిశ్రమల నిర్వహకులు పంచాయతీకి పన్నులు చెల్లించడం లేదు. దీంతో వారు ఎటువంటి అభివృద్ధి చేయడం లేదు. పన్నులను వసూలు చేస్తున్న ఐలా అధికారులు పారిశ్రామికవాడ వైపు కన్నెత్తి చూడడం లేదు. కేవలం పన్నులను వసూలు చేసుకొని వెళ్లి పోతున్నారు. తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడల నుంచి లక్షల రూపాయల్లో ఆదాయం వస్తున్నప్పటికి కనీసం మురుగు కాలువలను సైతం ఏర్పాటు చేయలేదు. దీంతో మురుగు నీటికి రసాయన పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ నీరు కలిసి పారిశ్రామిక వాడలో ఎక్కడపడితే అక్కడ మురుగు నిలబడి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ విషయాలను ఎపిఐఐసి అధికారులకు పరిశ్రమ నిర్వహకులు ఫిర్యాదులు చేస్తున్నప్పటికి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో అభివృద్ధి చేసే వరకు ఐలా చెల్లిస్తున్న పన్నులను చెల్లించకూడదని యజమానులు తీర్మానం చేసుకున్నట్లు తెలుస్తోంది.

అధికారులను నిలదీయడానికి సిద్ధంగా ఉన్న యజమానులు

రూరల్ మండలంలోని తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న పరిశ్రమల యజమానులతో సోమవారం ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌తో పాటు ఇతర అధికారులు సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో పరిశ్రమ యాజమాన్యల నూతన కార్యవర్గంతో పాటు ఇతర సమస్యలపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈ సమావేశంలో యజమానులు పారిశ్రామిక వాడలో మౌళిక సదుపాయాలతో పాటు 20 గుంతలు మూయడానికి ఖర్చు చేసిన రూ.40లక్షలు, పరిశ్రమ స్థలంలో వాణిజ్య భవన నిర్మాణం చేపట్టడం, అందులో మద్యం దుకాణం నిర్వహించడం తదితర సమస్యలపై అధికారులను నిలదీయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

రైల్వే అండర్ బ్రిడ్జిలో గుంతల మయంగా ఉన్న రోడ్డు

రసాయన వ్యర్థలతో కలిసిన మురుగు నీరు

స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు (ఫైల్‌ఫోటో)

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో గందరగోళం..!

ప్రజాశక్తి-కొత్తచెరువు

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియలో గందర గోళం నెలకొంది. మండల వ్యాప్తంగా 13,467 స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరు కాగా కొత్తచెరువు మేజర్ పంచాయతీలో 5వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిని పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు సచివాలయాల వారీగా విభజన చేశారు. సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేయాల్సిన స్మార్ట్ కార్డులను రేషన్ డీలర్లకు అప్పజెప్పి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకొన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేయడంతో వికలాంగులు, వృద్ధులు స్మార్ట్ రేషన్‌కార్డు తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రేషన్ కార్డు కోసం కొత్తచెరువులోని 8 చౌక ధాన్యపుదుకాణాల్లో తిరిగినా మాకు కార్డు లభించలేదని పలువురు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యావంతులే ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నిరక్షరాస్యులు, వృద్ధులు, వికలాంగులు స్మార్ట్ రేషన్‌కార్డుల కోసం పడుతున్న బాధలు వర్ణనాతీతం అని చెప్పవచ్చు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సచివాలయంలోనే అందజేసేలా లేదా వినియోగదారులకు సులభతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లెను కలిసిన గ్రంథాలయ ఉద్యోగులు

ఎమ్మెల్యేకు గ్రంథాలయ ఉద్యోగుల సన్మానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో గ్రంథాలయాల అభివృద్ధిపై పలు అంశాలను ప్రస్తావించారు. దీంతో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం అనంతపురం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు. అలాగే వారి సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మీరు సూచించిన అంశాలను సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఖచ్చితంగా గ్రంథాలయాలకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయరామ్, కమ్మన్న, ప్రతాప రెడ్డి, శ్రీనివాసులు, రవికుమార్‌నాయుడు, రామాంజనేయులు, బొజ్జేనాయక్, గోవిందు, ఖాజా మొయిద్దీన్ పాల్గొన్నారు.

నల్లమాడ : మండల నూతన ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన గంధంనేని శ్రీనివాసులు ఆదివారం అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండల ప్రజలకు అందు బాటులో ఉండి, మండలం అభివృద్ధికి కృషి చేయాలని వారు ఎంపిడిఒకు సూచించారు.

7న మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కొత్తచెరువు

పుట్టపర్తి మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా అక్టోబర్ 7వ తేదీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఛైర్మన్ పూల శివప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా శివప్రసాద్ ఆదివారం అమరావతి వెళ్లి తన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలని కోరుతూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మంత్రి మనోహర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శివప్రసాద్

నేడు ఎమ్మెల్యే పర్యటన వివరాలు

కదిరి అర్బన్ : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం పర్యటించే వివరాలను ఆదివారం ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు. పట్టణంలోని 3వ వార్డులో సైదాపురం కొమ్మినేని గంగయ్య నాయుడు ఇంటి వద్ద ఉన్న చౌక డిపో-20 వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. కావున ఆ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జాషువా జయంతి సభలో మాట్లాడుతున్న శివరామకృష్ణ

గుర్రం జాషువాకు నివాళి

ప్రజాశక్తి-పెనుకొండ

సామాజిక మార్పు కోసం సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకున్న మహాకవి గుర్రం జాషువా అని బహుజన చైతన్య వేదిక(బిసివి) అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఆదివారం బిసివి ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజం కోసం, అణగారిన వర్గాల గళాన్ని కవిత్వంగా మలిచి తుది శ్వాస వరకూ పోరాడిన మహనీయుడు గుర్రం జాషువా అన్నారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు నాగరాజు, ఆండ్రూస్, ఆనంద్, నరేష్, శశికుమార్, ఈశ్వర్, ఆంజనేయులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి : సిఐ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పాత నేరస్తులు మార్పు చెంది సత్ప్రవర్తనలో నడుచుకోవాలని పట్టణ సిఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. గతంలో మహిళల పట్ల దౌర్జన్యం చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, దాడి చేయడం, పోక్సో కేసుల్లో నిందితులుగా ఉన్న గుర్తించి ఆదివారం వారిని పోలీస్ స్టేషన్ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మంచి నడవడికతో మెలగాలని, భవిష్యత్తులో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకూడదన్నారు. మళ్లీ నేరాలకు పాల్పడితే కేసులు ఎదుర్కొని ఆర్థికంగా దెబ్బతిని కుటుంబాన్ని కూడా దూరం చేసుకునే పరిస్థితులు తలెత్తుతాయన్నారు. సిఐ వెంట ఎస్‌ఐ బాబ్‌జాన్, సిబ్బంది ఉన్నారు.



పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ నారాయణరెడ్డి

ధర లేక మొక్కజొన్న రైతు విలవిల..!

ప్రజాశక్తి-రొద్దం

అన్నదాతకు ఈ ఏడాది కష్టాలు తప్పడం లేదు. సరైన ధర లేక పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లలో ఉన్న చేప ఒడ్డుపై పడినట్లుగా మొక్కజొన్న రైతుల పరిస్థితి తయారైంది. మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో కలిపి వందల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. అయితే ఆశించిన రీతిలో దిగుబడి రాలేదు. ఎకరాకు 14 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి కష్టంగా ఉంది. దీనికి తోడు ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ. 1800 నుంచి రూ. 1900 ధర పలుకుతోంది. దీంతో సరైన ధర లేకపోవడంతో రైతులు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో నలిగిపోతున్నారు. పొలాన్ని కౌలుకి తీసుకొని పంట సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. కూలీలు దొరక్క, యంత్రాలకు అధిక ధర వెచ్చించి పంటను కోత

ప్రైవేట్ లే అవుట్ పంటను ఆరబెట్టిన రైతులు

కోసి నూర్పిడి చేశారు. తీరా పంటను విక్రయానికి పెట్టగా దళారులు సిండికేట్ అయి ధరలు తగ్గించారు. అందరూ ఒకే ధరతో కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తారు. కొందరు దళారులు రైతులకు ముందుగానే డబ్బులు అప్పుగా ఇస్తారు. దీంతో ఆ రైతు దళారి చెప్పిన ధరకే పంటను విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా పంట ఎక్కువగా వేయడంతో కనీసం పంట అరబెట్టుకోవడానికి ఒక్క గ్రామంలో కూడా కల్లాలు లేక ప్రయివేట్ వెంచర్లలో తారు రోడ్డుపై ఆరబోస్తున్నారు. వర్షం కురిస్తే రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

మొక్కజొన్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ఐదెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఎకరాకు రూ. 30వేల వరకు ఖర్చు అయింది. ఎకరాకు 18 క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. దళారులు క్వింటా రూ. 1800 నుంచి రూ. 1900తో కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టుబడి కూడా రాక నష్టపోతున్నాం. ప్రభుత్వమే మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

- సోమిరెడ్డి, బూచెర్ల సర్పంచి

పురంలో ముగిసిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమనిహిందూపురం డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ 5వ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ కుస్తీ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందూపురం డీఎస్పీ మహేష్, రూరల్ అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు, టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన యువతీ యువకులకు డిఎస్పి మహేష్, సిఐ ఆంజనేయులు గోల్డ్ మెడల్, ట్రోఫీలను అందజేశారు. మరి కొంతమందికి ప్రైజ్ మనీ అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కి చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యమన్నారు. కుస్తీ పోటీలు శారీరక, మానసిక బలాన్ని పెంపొందించడానికి, క్రమశిక్షణను అలవరచడానికి, శరీర నియంత్రణను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయన్నారు, ఈ క్రీడలో పాల్గొనడం ద్వారా క్రీడాకారులు భయాలను అధిగమించి, లక్ష్యాలను సాధించగలరన్నారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థుల జాతీయస్థాయిలో కూడా విజయాన్ని సాధించాలని కోరారు. రెండు రోజులు పాటు జరిగిన ఈ కుస్తీ పోటీలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 106 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 60 మ్యాచ్లు జరగగా ఇందులో 36 మంది విజేతలుగా నిలబడ్డారు. వీరు త్వరలో అయోధ్యలో జరిగే జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, సాయి సుమతి, సాయి లత, సురేందర్ రెడ్డి,పూలుకుంట సర్పంచ్ మంజునాథ్, సుమో సిన, శివ కుమార్, మహేష్, చరణ్, పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎస్పీ

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

క్రీడలతో మెరుగైన ఆరోగ్యం, భవిష్యత్తు : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

యువతీ, యువకులు క్రీడల పట్ల ఆసక్తి చూపితే ఆరోగ్యంతో పాటు భవిష్యత్తుకు దోహదపడతా యని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచించారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో డోలా రాజారెడ్డి ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. మూడో రోజైన ఆదివారం ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ క్రీడలు, క్రీడాకారులకు నా ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం విదేశీ వస్తువుల వాడకం తగ్గించి, స్వదేశీ వస్తు వులు వాడాలని ప్రతిజ్ఞ చేయించారు. పోటీల విజేతలు డాక్టర్ మదన మోహన్, ఆదినారాయణతో పాటు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు విజయ్, గుణ, పురుషోత్తం, చైతు, డోలా రాజారెడ్డి, నరేంద్రలకు నగదు, జ్ఞాపికలను మంత్రి అందజేశారు. అంపైర్లుగా వ్యవహరించిన ఎంబా రాము, కృష్ణమోహన్‌లను సన్మానించారు. క్రీడాకారులకు ఎన్జీవో అధ్యక్షులు పెనుబోలు శంకర్ అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు జనార్దన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కిరణ్, ఫ్రెండ్స్ షటిల్ టోర్నమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో 'రచ్చబండ'

గుడిబండ : వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం వైసిపి ఆధ్వర్యంలో మండలంలోని మైనగానపల్లి, గునేమోరుబాగల్ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మైనగానపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు అనంతరాజు మాట్లాడుతూ వైసిపి శ్రేణులు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. గునేమోరుబాగల్‌లో నిర్వహించిన కార్యాక్రమంలో ఆ పంచాయతీ అధ్యక్షుడు ఎస్.రంగనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సహాయకుల నూతన కార్యవర్గం

చిలమత్తూరు : మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు ఆదివారం చిలమత్తూరులో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.చిన్నపాపన్న, ఉపాధ్యక్షులుగా వి.నాగభూషణం, వి.నాగప్ప, కోశాధికారులుగా టి.లక్ష్మినారాయణ, డి.రఘునాథ్‌ను ఎన్నుకు న్నారు. సమావే శంలో పాల్గొన్న గ్రామ రెవెన్యూ సహాయకులు కొత్త కార్యవర్గాన్ని అభినందించారు. గ్రామ సహాయకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

బాలికలకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన

చిలమత్తూరు : స్థానిక వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని 11నుంచి18 ఏళ్ల బాలికలకు ఆరు రోజుల పాటు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో మాసిక ఆరోగ్యం, పోషణ, భద్రత, భవిష్యత్తు ప్రణాళిక, డిజిటల్ లిటరసీ, తదితర అంశాలపై వివరించారు. బాలికలు తమ నిర్ణయాలు స్వయంగా తీసుకునే ధైర్యం కలిగేలా రూపొందించారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, కౌన్సిలర్స్ డి.నందిత, గీత, వీరాపురం, కోడూరు, దూమకేతేపల్లి, టేకులోడు, సోమగట్ట, వెంకటాపురం, లక్ష్మీపురం ప్రాంత బాలికలు, తల్లిదండ్రులు, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

అవయవ దాత కుటుంబ సభ్యులకు సన్మానం

చిలమత్తూరు : మండలంలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ కావడంతో అతని తల్లి గీతమ్మ, కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో యువకుడి కళ్లు, కాలేయం, కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు దానం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం హిందూపురం అవయవదాన కమిటీ సభ్యులు చైతన్య గంగిరెడ్డి ఆధ్వర్యంలో గీతమ్మ, నవీన్ కుటుంబ సభ్యులను సన్మానించారు. అలాగే కమిటీ సభ్యులు అవయవదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జయంతి, తిప్పేస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంచిసముద్రంలో రోడ్డుపై మురుగు

రొద్దం : మండలంలోని కంచి సముద్రం గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసిందని చెప్పవచ్చు. ప్రధానంగా బిసి కాలనీలో డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు రోడ్డుపైకి చేరుతుంది. ఆ నీరు ఎటూ పోయే పరిస్థితి లేక అక్కడే నిల్వ ఉండడంతో ఆ రోడ్డు పాచి పెట్టింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఈ విషయంపై పలు మార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపైకి మురుగు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మురుగు నీరు చేరడంతో పాచిపట్టిన సీసీ రోడ్డు

3 నుంచి ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ

పుట్టపర్తి అర్బన్ : ఎలక్ట్రీషియన్ కోర్సులో ఈ నెల 3వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూపురం పట్టణంలోని ముక్కడిపేట ఎస్సీ హాస్టల్ బిల్డింగ్‌లో ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 3 నెలల శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 90529 01657, 91105 50779లో సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 40 ఏళ్ల తర్వాత బాల్య మిత్రులను కలవడం చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. నాటి తీపి గుర్తులను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. ఉద్యోగ రీత్యా దేశ, విదేశాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం హాజరయ్యారు. అనంతపురం నగరానికి చెందిన డాక్టర్ సుధీంద్ర స్నేహితులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిప్పేస్వామి, ఆనందరావు, పూర్వ విద్యార్థులు ఎంఇఒ రాఘవయ్య, శేషఫణి, శ్రీనివాస్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి

ధర్మవరం రూరల్ : భారత దేశ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించినప్పుడే చక్కటి మనశ్శాంతి లభిస్తుందని శ్రీగీతా భక్తమండలి సభ్యుడు దేవతా వెంకట నాగరాజు తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతిలో ఆదివారం కళాజ్యోతి సభ్యుల సౌజన్యంతో శ్రీవాల్మీకి రామాయణం క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాజ్యోతి గౌరవ సలహాదారు శింగనమల రామకృష్ణ, పిన్ను రామకృష్ణప్రసాద్, కోటి లక్ష్మీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. పోటీలకు న్యాయమూర్తులుగా దేవతా కృష్ణమూర్తి, దేవతా వెంకట నాగరాజు వ్యవహరించారు. మొత్తం 80 మంది విద్యార్థులు పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ చాలిన కె.సాయివాసవి, మధుర మీనాక్షి, షేక్ యాక్సిన, హేమంత్, ఖ్యాతి శ్రీవాణిలకు ముఖ్య అతిథులు నగదు బహుమతులు అందజేశారు. మిగిలి వారికి కూడా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నక్కల వెంకటేశులు, రంగస్వామి, పోసా నాగరాజు, బద్దెల రమణ, సోమశేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ధర్మవరం రూరల్ : వన్ టౌన్ సిఐ పేరం నాగేంద్ర ప్రసాద్ తన తల్లి పేరం స్వర్ణకుమారి ప్రథమ వర్ధంతి సందర్భం గా ఆదివారం మండలంలోని గొట్లూరు గ్రామంలో ఉన్న అనాథాశ్రమంలో చీరలు అందజేశారు. అలాగే ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సిఐ మాట్లాడుతూ నా తల్లి జ్ఞాపకార్థం అనాథాశ్రమంలో అన్నదానం, వస్త్ర దానం చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం ఫౌండర్, సీనియర్ జర్నలిస్ట్ ఎల్‌పి.చంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ధర్మవరం రూరల్ : పట్టణానికి చెందిన డిగ్రీ విద్యార్థి కె.మణిదీప్ అంతర కళాశాలల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పృథ్వీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పృథ్వీ మాట్లాడుతూ అనంతపురం నగరంలోని ఎస్-ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న మణిదీప్ ఈ నెల 25వ తేదీ అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీ క్రీడా మైదానంలో నిర్వహించి ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. మణిదీప్‌ను మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, ఆర్‌డిటి ఎటిఎల్ శ్రీనివాసులు, కోచ్‌లు అనిల్, రాజశేఖర్, పృథ్వీ అభినందించారు.

కె.మణిదీప్

ఈశ్వరీయ విద్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

సమాజాన్ని సన్మార్గంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్న బ్రహ్మకుమారీల కార్యక్రమాలు అన్ని ప్రాంతాలకు విస్తరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకాంక్షించారు. రామగిరిలో ఏర్పాటు చేసిన ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీత హాజరయ్యారు. అక్కడ నిర్వహించే కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ధ్యానం, ఆధ్యాత్మిక బోధనలు, సామాజిక, సేవా కార్యక్రమాలు, ఆహార నియమాలు, బ్రహ్మచర్యం, ఆత్మశుద్ధి వంటి కార్యక్రమాలు సమాజంలో ఉన్నత జీవనానికి దోహదపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రాజయోగిని బ్రహ్మకుమారి సుగంధ సిస్టర్, కమల సిస్టర్, హేమలత సిస్టర్, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

చిలమత్తూరు : స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సుందరయ్య కాలనీలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సదాశివరెడ్డి, అశ్వర్థరెడ్డి, సమీవుల్లా, సిపిఎం సుందరయ్య కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎస్పీ ఎస్.సతీష్ కుమార్

మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టే దిశగా నూతన ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుంచే మహిళలపై నేరాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసు స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మార్పు తీసుకురావాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా నేరస్తులు, రౌడీషీటర్లకు అన్ని ఎస్‌డిపిఒ, సర్కిల్ పోలీస్ స్టేషన్లలో అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో మైనర్ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, హత్యలు, నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఈ నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి వీటిని అరికట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే అమ్మాయిల వెంటపడి వేధించడం, ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి నేరస్తుల కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా రౌడీ షీట్ ఓపెన్ చేయడంతో పాటు కఠిన శిక్షలు తప్పవన్నారు. ఇక నుంచి నేరస్తులు, రౌడీ షీటర్ల ప్రవర్తనలో మార్పు రావాలని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన సరస్వతి(35) ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాలు.. సరస్వతి భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె కూలి పని చేసుకుంటూ తన ఇద్దరు కుమారులను పోషించుకునేది. ఆదివారం ఆమె విద్యుత్ మోటారు ఆన్ చేసి నీటిపైపుతో ఇంటిని శుభ్రం చేసే క్రమంలో మోటార్‌ను పక్కకు జరిపే ప్రయత్నం చేసింది. దీంతో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురైంది. విషయం తెలుసుకున్న బంధువులు, స్థానికులు సరస్వతిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలిసిన వెంటనే టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దూసుకొచ్చిన కారు.. 13 గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండలంలోని గంటాపురం క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు దాటుతున్న గొర్రెలపైకి కారు దూసుకుపోవడంతో 13 జీవాలు మృత్యువాత పడగా, మరో 12 తీవ్రంగా గాయ పడ్డాయి. గొర్రెల కాపరి తెలిపిన వివరాలు.. గంటాపురం గ్రామానికి చెందిన భూమే అప్పస్వామి గొర్రెల మందను మేపి సాయంత్రం ఇంటి దారి పట్టించాడు. ఈ క్రమంలో గంటాపురం క్రాస్ వద్ద జీవాలు రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు నుంచి కదిరి వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా గొర్రెల మందపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో 13 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 12 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదానికి కారణమైన కారును డ్రైవర్ ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. కారు నెంబర్ ప్లేట్ అక్కడే పడిపోయింది. ఆరు నెలలు క్రితం రూ. 4 లక్షలు అప్పులు చేసి జీవాలు కొనుగోలు చేసినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అలాగే బత్తలపల్లి ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ అధికారులు శ్రీనివాసులు, గుర్నాథరెడ్డి ఆదేశాల మేరకు గోపాలమిత్రలు ప్రమాదస్థలానికి చేరుకుని గాయపడిన గొర్రెలకు చికిత్స అందించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపి కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ స్టేషన్ లో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఆదివారం విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. హిందూపురం నుంచి కెంచనపల్లికి వెళ్లే రహదారిలో కిరికెర క్రాస్ వద్ద ఓ వ్యక్తి కర్నాటక మద్యం కలిగి ఉండడంతో అతన్ని అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద నుంచి 48 కరానటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కొల్లకుంట బ్రిడ్జి వద్ద మద్యం విక్రయి స్తున్న ఒకరిని అరెస్ట్ చేసి అతడి నుంచి 8 మద్యం బాటిళ్లు, అలాగే చిలమత్తూరు మండలంలో కొడికొండ నుంచి మోరంపల్లికి వెళ్లే రహదారిలో 6 లీటర్ల మద్యం కలిగి ఉన్న మహిళను అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అదే విధంగా పట్టణ, మండల, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండల పరిధిలో ఉన్న కల్లు దుకాణాలను తనిఖీ చేశామని చెప్పారు.కల్తీ కల్లు అమ్మినా, తయారు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే కల్లు దుకాణాలో శాంపిళ్లను సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీ, ఫారూక్, నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లిలో చోరీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వేల్పుమడుగు గ్రామానికి చెందిన దేవరపల్లి చిన్న చిన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గత శుక్రవారం తమ ఇలవేల్పు దేవుడైన అహోబిలేశ్వరస్వామి దర్శనార్థం అహోబిలం వెళ్లారు. వారు తిరిగి శనివారం ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు ఇంటికి వేసిన తాళాన్ని పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువా లాకర్‌ను ధ్వంసం చేశారు. బీరువాలో ఉంచిన 3.5 తులాల బంగారు చైన్, రెండు జతల కమ్మలు, రూ. 5 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు చిన్న చెన్నారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ గ్రామం వెళ్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని లింగిశెట్టిపాలెం వీధికి చెందిన ఓబులేసు కుమారుడు నితిన్(12) శనివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ బాలుడు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలోచికిత్స పొందుతూ ఆదివారం నితిన్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి నేత సందా రాఘవ బాలుడి ఇంటికి వెళ్లి నితిన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ. 10వేలు అందజేశారు.

మహారాజ శ్రీ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి వారి కోర్టులో

E.P. No. 8/2024 In O.S. NO. 264/2022

Between:

సోమేపల్లి గంగాధర్ ...డిక్రీహోల్డర్

And

దేశాయి కాళిదాసు రెడ్డి ...జెడ్జిమెంట్ డేటార్

జడ్జిమెంట్ డేటార్‌కు నోటీసు

దేశాయి కాళిదాసు రెడ్డి, S/o శివకేశవ రెడ్డి, వయస్సు 65 సం...లు, హిందూ, D.No. 1-91, RTC బస్టాండ్ దగ్గర, అయిన మీకు తెలియజేయడమేమనగా పై కేసు మీ హాజరు నిమిత్తము 24-10-2025వ తేదీన కలదు. సదరు వాయిదా రోజున ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఏవైనా ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానీ యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియబరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:24-10-2025
స్థలం:కదిరి

పఠాన్ జాఫర్ ఖాన్,
డిక్రీ హోల్డర్ వకీలు,వకీలు
సెల్ నెం: 9440988774